క్లుప్తంగా

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏపీసీఆర్‌పీఎఫ్ ప్రతినిధులు

కేవీపల్లె : విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉజ్వల భవితకు పునాది వేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కన్సూమర్ రైట్ ప్రటెక్షన్ ఫోరం (ఏపీసీఆర్‌పీఎఫ్) ప్రతినిధులు దర్బార్‌బాషా, ఎస్.నాగరాజ అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బేటీ పడావో.. బేటీ బచావో అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడ పిల్లలను రక్షించాలని, ఆడ పిల్లల విద్యను ప్రోత్సహించాలని కోరారు. ప్లాస్టిక్ నిర్మూలను ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వై.వి. రమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న ఏపీఓ మహేష్

పీలేరు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని ఏపీఓ మహేష్ అన్నారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పల్లెకు తిరిగి కూలీల సంఖ్య పెంచాలన్నారు. పీలేరు కరువు మండలం కావడంతో ఒక్కో కూలికి 150 పని దినాలు కల్పించాలని సూచించారు. త్వరలో సామాజిక తనిఖీ సమావేశం ఉంటుందని, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు.

తూనికలు, కొలతలపై అవగాహన



శిక్షణ ఇస్తున్న జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి కె.జె. రవీంద్రారెడ్డి

పీలేరు రూరల్ : తూనికలు, కొలతలపై అవగాహన కలిగివుండాలని జిల్లా తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ కె.జె. రవీంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూనికలు, కొలతల శాఖకు అనుసంధానంగా పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పని చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ దుకాణాల్లో తూనికలు, కొలతలు పరిశీలించి ప్రభుత్వంచే ముద్ర పొందిందా లేదా నివేదికలు పంపాలన్నారు. కార్యక్రమంలో తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ నాగరాజ్, ఎంపీడీవో మురళీమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వార్డుల్లో లైబ్రరీలు ఏర్పాటు చేయాలి

మదనపల్లె సిటీ : మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో లైబ్రరీలు ఏర్పాటు చేయాలని టౌన్ అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గొల్లపూడి తిరుపతిరావు మున్సిపల్ కమిషనర్‌ను బుధవారం కోరారు. పట్టణంలో ఒక శాఖ గ్రంథాలయం, ఐదు మున్సిపాలిటీ సంఘ లైబ్రరీలు ఉన్నాయన్నారు. వార్డుల్లో లైబ్రరీలు ఏర్పాటు చేసి తెలుగు, ఆంగ్ల దిన పత్రికలు అందుబాటులో ఉంచాలన్నారు.

శబరిమలకు అయ్యప్ప భక్తులు

రామసముద్రం : రామసముద్రం మండలంలోని పెద్దకురప్పల్లె పంచాయతీ తిరుమలరెడ్డిపల్లె , మట్లవారిపల్లె గ్రామానికి చెందిన అయ్యప్ప భక్తులు బుధవారం ఇరుముడి కట్టుకొని శబరిమలకు వెళ్లారు. పెద్దకురప్పల్లె పంచాయతీ నుంచి సుమారు 60 మంది భక్తులకు గురుస్వాములు నరసింహులు, రెడ్డెప్ప ఇరుముడులు కట్టారు.

ఆధారాలు అందజేస్తేనే కంప్యూటరీకరణ

పెద్దతిప్పసముద్రం : స్థానిక సొసైటీ బ్యాంకు పరిధిలోని ఓటర్లు వారి ఆధార్, రేషన్ కార్డుతో పాటు ఫొటోలు అందజేస్తేనే కంప్యూటరీకరణ సాధ్యమని బ్యాంకు అధ్యక్షుడు సుబ్రమణ్యం రెడ్డి, సీఈఓ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ సంఘ సభ్యులు మొత్తం 14,082 మంది ఉండగా 6,292 మంది ఓటర్లుగా ఉన్నారన్నారు. ఓటర్‌గా ఉన్న ప్రతి ఒక్కరి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కావాలంటే సంబంధిత జిరాక్స్ ప్రతులను బ్యాంకులో అందజేయాలన్నారు.

అధిక ఫీజు వసూలు చేసిన కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణంలోని ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీల్లో ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన పరీక్ష ఫీజుల కంటే అధికంగా వసూళ్లు చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మాధవ్ ఆరోపించారు. బుధవారం పట్టణంలోని పలు ప్రైవేటు కాలేజీల ఎదుట ధర్నా చేశారు.

అంబేడ్కర్ సేవలు నిరుపమానం

మదనపల్లె : బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ చేసిన సేవలు నిరుపమానమని ఎంపీపీ రెడ్డెమ్మ అన్నారు. బుధవారం అంబేడ్కర్ 67వ వర్ధంతి సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో డీఎల్‌డీఓ లక్ష్మీపతి, తహసీల్దార్ మహబూబ్‌చాంద్, ఎంపీడీఓ భానుప్రసాద్, మాలమహానాడు యమలాసుదర్శనం, ఎంఆర్‌పీఎస్ నరేంద్రబాబు తదితరులతో కలసి ఆమె డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రెడ్డెమ్మ మాట్లాడుతూ.. అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుస్తూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి అహర్నిశలు కృషిచేస్తోందన్నారు. భారత రాజ్యాంగశిల్పి, బోధిసత్వ బాబాసాహెబ్ అంబేడ్కర్ వర్ధంతిని కులనిర్మూలనా పోరాట అమరవీరుల దినంగా వీసీకే- భారతీయ అంబేడ్కర్ సేన సంయుక్తంగా నిర్వహించాయి. వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం.శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజయభారతి ఎస్.సేతు ముఖ్యఅతిథిగా పాల్గొని బెంగళూరురోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బహుజన్ సమాజ్‌పార్టీ, మదనపల్లె ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెలగౌతమ్‌కుమార్ స్థానిక గాంధీపురంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళుర్పించారు. ప్రపంచ జ్ఞానసత్వునికి క్రాంతి నీరాజనం పేరుతో బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు ఆధ్వర్యంలో నివాళులర్పించి, నిమ్మనపల్లె జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మాలమహానాడు ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీబస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి అధ్యక్షులు యమలాసుదర్శనం, గుండామనోహర్ తదితరులు నివాళులర్పించారు. రాష్ట్రగిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో న్యూకాలనీ గేట్‌సర్కిల్‌లో కోనేటిదివాకర్, బండిరమణ, కోనేటి రామాంజులు, కిల్లారెడ్డిశేఖర్ తదితరులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.



మదనపల్లె : అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు,



తంబళ్లపల్లె : నివాళి అర్పిస్తున్న మెడికల్ ఆఫీసర వెంకటరామయ్య

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్

కలికిరి : రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్.అంబేడ్కర్ ఆదర్శనీయుడని వైఎస్సార్ విద్యార్థి సంఘం నాయకుడు నరేష్ అన్నారు. అంబేడ్కర్ 67వ వర్ధంతిని పురస్కరించుకుని వైఎస్సార్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో బుధవారం కలికిరి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సీ బాలికల గురుకుల కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటం ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ జాతికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ అంజలీదేవి, ఎన్ఎస్ఎస్ పీఓ గులాబ్ జాన్, అధ్యాపకులు మాధవి, స్వర్ణలత, ఉదయ, లిఖిత, హాజీర, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేడ్కర్ వర్ధంతి

వాల్మీకిపురం : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 67వ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి స్థానిక గాంధీ బస్టాండ్ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోని యువతకు అంబేడ్కర్ ఆదర్శప్రాయుడని, దేశంలోని పౌరులంతా అంబేడ్కర్ అడుగు జాడల్లో నడవాల్సిన అవసరం ఉందన్నారు. సర్పంచ్ గంగులమ్మ, నాయకులు చింతల శివానంద రెడ్డి, నీళ్లభాస్కర్, కిరణ్‌కుమార్, అబ్దుల్ కలీమ్, కేశవ రెడ్డి, రఘు, రవి, జయచంద్ర, షాహెద్, సాధిక్, సుధాకర, శివయ్య, ఆనంద, మస్తాన్, సైపుల్లా పాల్గొన్నారు.

పీలేరులో..

పీలేరు : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పీలేరులో ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి వివిధ సంఘాల నాయకులు పూల మాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉన్నతమైన రాజ్యాంగాన్ని మనకు అందించి సమానత్వాన్ని తీసుకొచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో వివి ధ సంఘాల నాయకులు ధరణికుమార్, పాలకుంట శ్రీనివాసులు, సుభాష్, నరేష్, అంజలిదేవి, గులాబ్‌జాన్, మాధవి, అమీరుల్లా, లోకనాథం, రవీంద్ర, ఆ నంద్, షాహీన్‌షా, రాజమ్మ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

కేవీపల్లె : ప్రపంచంలోనే మన దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదర్శప్రాయుడని ప్రజాసంఘ నాయకులు ముల్లంగి చంద్రయ్య అన్నారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద వివిధ సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశానికి దశ, దిశ చూపించడమే గాక మేధావులకు మన దేశ సామాజిక అంశాలను అంబేడ్కర్ వివరించారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి, వివిధ సంఘాల నాయకులు దొడ్డి సురేష్, ఎ.చంద్రయ్య, అశోక్‌సామ్రాట్, శేషాద్రి పాల్గొన్నారు.

రామసముద్రంలో..

రామసముద్రం : రామసముద్రంలో అంబేడ్కర్ వర్ధంతి వేడుకలను ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడు రాజేష్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగశిల్పిగా, సమసమాజ స్థాపన కోసం ప్రజాస్వామ్య పరిరక్షకునిగా ఆయన దేశానికి ఎన్నో సేవలు చేశారన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ గౌరవ అధ్యక్షులు అయ్యప్ప, ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఎస్సీ సెల్ అధ్యక్షులు కృష్ణప్పం, వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు విశ్వనాథ్, మణి, ఖాన్, లక్ష్మన్న, శివ, కృష్ణ , దిగువపాళ్యెం శివ పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి

తంబళ్లపల్లె : అణగారిన వర్గాల ఆశాజ్యోతిగా భారత రాజ్యాంగ నిర్మాతగా డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలు మరపురానివని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరామయ్య అన్నారు. బుధవారం స్థానిక సీహెచ్‌సి నాయకులు మల్లికార్జున, భాస్కర్, జగదీష్ ఆధ్వర్యంలో అంబేడ్క వర్ధంతి నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూజలు చేసి నివాళులు అర్పించారు. ఆస్పత్రిలోని రోగులకు బ్రెడ్లు, పాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో డాక్టర్లు రిచర్డ్, విశ్రాంత్‌రెడ్డి, తేజస్విని, సుమలత, హెడ్ నర్సు గ్లోరీ, సిబ్బంది పాల్గొన్నారు. ఫోర్డు సంస్థ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.



వాల్మీకిపురం : అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే చింతల

అంబేడ్కర్ జాతికి కాదు జాతీయ నాయకుడు

పెద్దతిప్పసముద్రం : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతికి కాదు జాతీయ నాయకుడు అని పలువురు వక్తలు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన ఆయన వర్ధంతి వేడుకల్లో భాగంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానిక సర్పంచ్ తమక శంకర్, ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి, ఎస్ఐ రవీంద్రబాబు, హౌసింగ్, డిస్కం ఏఈలు శ్రీనివాసులు, ఉత్తన్నతో పాటు దళిత సంఘాల నాయకులు కేవీ రమణ, లక్ష్మినారాయణ, కాట్నగల్ రమణ, శివ తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట : అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాలు బుధవారం బి.కొత్తకోటలో ఘనంగా జరిగాయి. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రఫీక్‌అహ్మద్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి భవాని, వెంక టేష్, బాస్‌జిల్లా కార్యదర్శి సింగన్న ఆధ్వర్యంలో వేర్వేరుగా అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

సీఎం జగన్‌తోనే సుస్థిర పాలన

- పేదలకు సంక్షేమం అందాలంటే జగనే రావాలి
- దోచుకున్నందుకే చంద్రబాబు జైలుకెళ్లారు
- ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : పేదవర్గాలకు పారదర్శకంగా సంక్షేమం అందాలంటే సీఎంగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. పట్టణంలోని 18వవార్డు అప్పారావు వీధి, 28వవార్డు దొంతిలేఅవుట్ వార్డు సచివాలయాలు, మండలంలోని కొత్తవారిపల్లె-2 పంచాయతీ దుబ్బిగానిపల్లె గ్రామసచివాలయ పరిధిలో బుధవారం వై నీడ్స్ ఏపీ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయా సచివాలయాల పరిధిలో ప్రజలకు వివిధ పథకాల రూపంలో అందిన లబ్ధిని తెలిపే వివరాలతో కూడిన సంక్షేమ పథకాల డిజిటల్‌బోర్డులను ఆవిష్కరించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ... పుట్టిన బిడ్డ నుంచి వృద్ధుల వరకు సంక్షేమాన్ని అందిస్తూ చిన్న వయస్సులోనే ప్రజల మన్ననలు పొందుతున్న సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలుస్తారన్నారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయడమే కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేదింటి పిల్లలను అమెరికా వరకు పంపిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. చంద్రబాబు హయాంలో వందలాది కోట్లు దాచుకో..దోచుకో అన్నట్లుగా వ్యవహరించి, జైలు ఊచలు లెక్కపెట్టి వచ్చారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ నూర్‌ఆజం, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ జి.వెంకటరమణ, డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు బావాజీ, మునిశేఖర్, పోతబోలు నాగరాజ, వైఎస్సార్ సీపీ నాయకులు ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరురఫీ, షరీఫ్, అంజనేయులు, కౌన్సిలర్లు వసీం, మేస్త్రీశ్రీనివాసులు, బి.ఏ.ఖాజా, ఎం.వి.రమణ, చరణ్, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.



మదనపల్లె: 28వవార్డులో సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన

మదనపల్లె : పేదల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. మండలంలోని తట్టివారిపల్లె పంచాయతీ వెంకప్పకోట గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సిద్దలదీపా, వేమారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. షేక్ ఇస్మాయిల్, నీరుగట్టిరమణ, జేసీఎస్ కన్వీనర్ పోతబోలునాగరాజ, తట్టిహరికృష్ణరెడ్డి, మోహన్‌రెడ్డి, కుమ్మరరమణ, కొల్లేశేఖర్‌బాబు, రెడ్డిశేఖర్‌రెడ్డి, ఆవులసోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రెఫర్ కేసులు తగ్గించాలి

ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి వచ్చే రోగులను రెఫర్ చేయడం తగ్గించాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. బుధవారం అన్నమయ్యజిల్లా డీసీహెచ్ఎస్ డేవిడ్ సుకుమార్, చిత్తూరుజిల్లా డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌రెడ్డితో కలిసి ఆస్పత్రిని పరిశీలించారు. వార్డుల్లో పర్యటించారు. రోగులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిపై జరుగుతున్న మెడికల్ కళాశాల అదనపు భవన నిర్మాణపనులను పరిశీలించి, త్వరగా పూర్తిచేయాలన్నారు.

మృతిడి కుటుంబానికి ఓదార్పు

కురబలకోట : మండలంలోని మనమరెడ్డిగారిపల్లి గ్రామం గడ్డెత్తుపల్లెకి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు డి. శివకుమార్ (30) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గ్రామంలో వైఎస్సార్ సీపీకి తీరని లోటన్నారు. వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు. అతని పిల్లలను దగ్గరకు తీసుకొని ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. వారిని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఎంపీపీ బి. దస్తగిరి, బైసాని చంద్రశేఖర్ రెడ్డి, ఎన్వీ రమణారెడ్డి,ఆర్సీ ఈశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, సోమిరెడ్డి, ఆర్కే కృష్ణారెడ్డి, ఎంపీటీసీ ఆనందరెడ్డి, నాగరాజరెడ్డి, మధు,శేఖర్ రెడ్డి, సుబ్బారెడ్డి, మంజునాధరెడ్డి, శంకర్‌రెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పరామర్శించారు.

ఈవీఎంలపై అవగాహన అవసరం



గుర్రంకొండలో మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

గుర్రంకొండ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన కలిగి ఉండాలని ఎన్నికల క్లస్టర్ అధికారి సురేంద్రబాబు అన్నారు. బుధవారం స్థానిక తెలుగు జెడ్పీ హైస్కూల్లో సచివాలయ ఉద్యోగులకు, వివిధ పార్టీల పోలింగ్ ఏజెంట్లకు ఈవీఎంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎలక్ట్రానిక్ యంత్రాల పనితీరుపై ప్రదర్శన ఇచ్చారు. అన్ని పార్టీలకు చెందిన పార్టీ ప్రతినిధులు, పోలింగ్ ఏజెంట్లతో మూక్‌పోలింగ్ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అందరూ ఈవీఎంల పనితీరు కచ్చితంగా తెలుసుకోవాలన్నారు. ఇందులో ఎలాంటి తప్పిదాలకు తావులేదన్నారు. ఎవరికైన సందేహాలుంటే వెంటనే పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఖాజాబీ, జెడ్పీటీసీ సద్రీన్‌ముక్తియార్, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ గణేష్, హౌస్‌ఫెడ్ కార్యదర్శి గయాజ్, మండల ఆర్బీకే డై రెక్టర్ సిమెంట్ మురాషా, వివిధ పార్టీలకు చెందిన పోలింగ్ ఏజెంట్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి

- జగన్ నిజం..చంద్రబాబు అబద్ధం
- జాగ్రత్తగా ఆలోచించాల్సిన సమయం ఆసన్నం
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

కురబలకోట : అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూడండి..రానున్న ఎన్నికల్లో సీఎం జగన్ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కోరారు. బుధవారం ఆయన అంగళ్లులో స్థానిక నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌లా గతంలో ఏ ముఖ్య మంత్రి అయినా ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేశారా అని ఒక సారి ఆలోచించాలన్నారు. ప్రజలు ఇంటి నుంచి కాలు బయటపెట్టకుండా వివిధ పథకాల ద్వారా లబ్ధిపొందుతున్నారన్నారు. పార్టీలకు అతీతంగా నేరుగా బ్యాంకు ఖాతాలకు డబ్బు జమ చేశారన్నారు. నియోజక వర్గంలో రోడ్డు లేని ఊరు లేదన్నారు. గ్రామ స్థాయిలోనే సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్నారు. అబద్దాలు చెప్పే చంద్రబాబు కావాలా.. చెప్పింది చేసే సీఎం జగన్ కావాలా అన్నది ఈసారి జనం బాగా ఆలోచించాలన్నారు. పంచాయతీలు, డివిజన్ కేంద్రాలు, జిల్లాలు పునర్విభజన చేయడం జరిగిందన్నారు. పాలన ప్రజలకు మరింత దగ్గరైందన్నారు. సచివాలయాలకు, కార్యాలయాలకు నేరుగా వెళ్లి ప్రజలు పనులు చేసుకోగలుగుతున్నారన్నారు. రానున్నది ఎన్నికల కాలం.. ప్రజలు జాగ్రత్తగా ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. నాయకులు సురేంద్రనాథ్, బైసాని చంద్రశేఖర్ రెడ్డి, బి. దస్తగిరి, పోరెడ్డి విశ్వారెడ్డి, ఆర్కే కృష్ణారెడ్డి, ఆర్సీ ఈశ్వర్ రెడ్డి, ఆది, సుధాకర్‌రెడ్డి, శెట్టి భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



అంగళ్లులో స్థానిక నాయకులతో ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

రైతులకు ఉపయోగపడేలా 'ఉపాధి'

బి.కొత్తకోట : ప్రభుత్వం కొత్తగా ప్రాధాన్యత ఇస్తున్న ఉపాధి పనులను రైతులు ఉపయోగించుకునేలా చూడాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కోరారు. బుధవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఉపాధి నూతన మార్గదర్శక కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల విషయంలో తంబళ్లపల్లె మొదటిస్థానంలో ఉంటూ వచ్చిందని గుర్తుచేశారు. కోవిడ్‌సమయంలో వలసకూలీలకు, నిరుద్యోగులకు ఉపాధిపనులు కల్పించడంలో తంబళ్లపల్లె రాష్ట్రంలోనే మొదటి స్థానంలో వచ్చిందన్నారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ మధుబాబు, ఎంపీడీఓ శంకరయ్యపాల్గొన్నారు.

ఉపాధి హామీ పోస్టర్ల ఆవిష్కరణ

ములకలచెరువు : ఉపాధి హామీ పథకం ద్వారా అమలవుతున్న ప్రతి రాయితీ పథకాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పెద్దరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి సూచించారు. బుధవారం 'ఉన్న ఊరిలో పని కోరడం మీహక్కు-పని కల్పించడం మా బాధ్యత' అనే పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. క్లస్టర్ ఏపీడీ మధుబాబు మాట్లాడుతూ రైతుల జీవన ప్రమాణాల పెంపుదల, సుస్థిర ఆస్తుల కల్పన, నికర ఆదాయ మార్గాల పెంపుదలే ఉపాధి హామీ పథకం ప్రధాన లక్ష్యమన్నారు.

చక్కటి దృష్టితోనే మంచి ఆరోగ్యం

పీలేరు : చక్కటి దృష్టితోనే మంచి ఆరోగ్యం సాధ్యమని డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్ అన్నారు. బుధవారం కావలిపల్లె హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో 'శిశువులకు - విటమిన్‌ఏ ద్రావణం' ఆవశ్యకత అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞానేంద్రియాలలో కళ్లు అతి విలువైనవని, మీ బిడ్డ చక్కటి కంటి దృష్టికి విటమిన్ ఏ సమృద్ధిగా వుండే అదనపు ఆహారాన్ని ఆరో నెల నుంచే ఇవ్వాలన్నారు. విటమిన్ ఏ ద్రావాన్ని పదో నెల నుంచి ప్రతి ఆరు నెలలకోసారి ఐదు సంవత్సరాల వరకు వేపించాలన్నారు. వెన్న, నెయ్యి, గుడ్లు, కాలేయం, చేపలు, తాజా ముదురు ఆకుపచ్చ రంగు ఆకు కూరలు, మామిడి, బొప్పాయి, క్యారెట్, గుమ్మడి ఆహారంగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఈ కొండయ్య, ఎంపీహెచ్ఈవో శ్రీను, పంచాయతీ కార్యదర్శి నవీన్, ఏఎన్ఎం లక్ష్మీ, సీహెచ్‌వో సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్

కులగణన పకడ్బందీగా చేపట్టండి

మదనపల్లె : గ్రామాల్లో కులగణన సర్వే పకడ్బందీగా చేపట్టాలని ఎంపీపీ రెడ్డెమ్మ, డీఎల్‌డీఓ లక్ష్మీపతి ఆదేశించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ కులగణన-2023 సర్వేకు సంబంధించి సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపాధిహామీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వివిధ కులసంఘాల నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రెడ్డెమ్మ మాట్లాడుతూ.. ఏపీలో కులగణన అనే చారిత్రక ఘట్టానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. కులగణన నిర్ణయం రాజకీయ ప్రయోజనాల కోసం కాదని, సామాజిక ప్రయోజనాల కోసం తీసుకున్న నిర్ణయమన్నారు. డీఎల్‌డీఓ లక్ష్మీపతి మాట్లాడుతూ...ప్రభుత్వం సూచించిన విధంగా డిజిటల్ విధానంలో ఈనెల 9 నుంచి ప్రతి ఇంటికి వెళ్లి కులగణన సర్వే చేయాలన్నారు. వారంరోజుల వ్యవధిలో సర్వే పూర్తిచేయాలని సూచించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్ సహాయంతో ఇంటింటికీ వెళ్లి కుటుంబసభ్యుల అంగీకారంతో ప్రభుత్వం ఇచ్చిన ఫార్మాట్ ప్రకారం కులాలను గుర్తించాలన్నారు. కులగణన ఆధార్ లింక్‌డ్ సర్వే అని, ఇందులో ప్రజల వివరాలు గోప్యతగా ఉంచడం జరుగుతుందన్న విషయాన్ని స్పష్టంగా తెలపాలన్నారు. కార్యక్రమంలో వెలుగుచంద్ర, ఎంపీడీఓ భానుప్రసాద్, తహసీల్దార్ మహబూబ్‌చాంద్, సర్పంచ్ శరత్‌రెడ్డి, వెంకటరమణ, కౌన్సిలర్ ప్రసాద్‌బాబు, మాలమహానాడు యమలాసుదర్శనం, గుండామనోహర్, ఎంఆర్‌పీఎస్ నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ లక్ష్మీపతి

సమన్వయంతో కులగణన చేపట్టాలి

కలికిరి : కులగణన చేపట్టే సిబ్బంది క్షేత్ర స్థాయిలో ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ గంగయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఈ నెల 10 నుంచి చేపట్టబోయే కులగణనపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కులగణన సమాచారంపై ముందుగా ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడంతో పాటు దండోరా వేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దారు భాగ్యలత, ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ పాల్గొన్నారు.

తాలూకా ఎస్ఐగా రవికుమార్



మదనపల్లె : మదనపల్లె తాలూకా పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా జి.రవికుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకటేష్ సాధారణ బదిలీల్లో భాగంగా రాయచోటి ట్రాఫిక్ విభాగానికి బదిలీ కాగా, చిత్తూరుజిల్లా చౌడేపల్లె ఎస్ఐగా పనిచేస్తున్న జి.రవికుమార్ ఇక్కడకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషిచేస్తానన్నారు.

మంచి అధికారులు గుర్తుండిపోతారు



ఎస్ఐను సత్కరిస్తున్న నాయకులు

బి.కొత్తకోట : ప్రజలకు సేవలు అందించిన అధికారులు గుర్తుండిపోతారని కమిషనర్ పి.ఆర్.మనోహర్, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్ అన్నారు. బదిలీ అయిన ఎస్ఐ రామ్మోహన్‌ను బుధవారం ప్రజాప్రతినిధులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలు, శాంతిభద్రతల పరిరక్షణ, పేదలకు న్యాయం చేయడంలో చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు గుడిపల్లిరఘునాథ్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, యల్లప్ప, శంకర్‌రెడ్డి, రెడ్డీశ్వర్‌రెడ్డి, బలరాంరెడ్డి, చిన్నికృష్ణ పాల్గొన్నారు.

పంట నష్ట నివారణ చర్యలు చేపట్టాలి

కలికిరి : మిచాంగ్ తుపాను కారణంగా పంటలకు జరిగిన నష్టానికి నివారణ చర్యలు చేపట్టాలని కేవీకే కో-ఆర్డినేటర్ పాండురంగ అన్నారు. బుధవారం మండల పరిధిలో వివిధ రకాల పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా అన్ని రకాల పంటపొలాల్లో నిలిచిన నీరును బయటకు తీయాలన్నారు. పిలకలు తొడిగే దశలో ఉన్న వరిపైరుక ఎకరానికి 30కిలోల యూనియా, 15 కిలోల పొటాష్ ఎరువు వేయాలని, గింజ దశలో ఉన్న వరిపైరుకు టిల్ట్ 1మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే కోతకు సిద్ధంగా ఉన్న వరికి 5శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేస్తే విత్తనాలు మొలకెత్తకుండా ఉంటాయన్నారు. మిరప, వేరుశనగ, మామిడి పంటలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న కేవీకే కో-ఆర్డినేటర్ పాండురంగ

సమస్యలను పరిష్కరించాలి

పీలేరు రూరల్ : జిల్లాలోని అన్ని డిపోలలో వివిధ కేటగిరిల్లో ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎన్ఎంయూ జిల్లా కార్యదర్శి పి.ఎస్.ఎం. రాజు అన్నారు. బుధవారం రాయచోటిలో డీపీటీఓ రాముకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు డిపోల పరిధిలోని స్పేర్, యాక్సిడెంట్ కేసులు పరిష్కరించాలన్నారు. మంత్లీ ఇన్సెంటీవ్‌లు పెండింగ్ లేకుండా ఇవ్వాలన్నారు. అన్ని డిపోలలో స్పెషల్ టూల్స్, స్పేర్ పార్ట్స్ అందుబాటులో ఉంచి గ్యారేజీ కార్మికులకు పనిభారం తగ్గించాలన్నారు. జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు వై.ఎస్. రాములు, అసిస్టెంట్ కార్యదర్శులు సుధాకర్, పి. నాధం, జాయింట్ కార్యదర్శుల రెడ్డెప్ప, పి.వి. రమణ, పి.వి.నాయుడు, శేఖర్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు 9 వరకే గడువు

పెద్దమండ్యం : కొత్తగా ఓటరు నమోదు చేసుకునేందుకు ఈ నెల 9 వరకు గడువు ఉన్నట్లు తంబళ్లపల్లె నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాఘవేంద్ర తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం బీఎల్‌వోలతో ఓటర్ల జాబితాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలింగ్ స్టేషన్‌ల వారీగా కొత్త ఓటర్ల నమోదు, మరణించిన ఓటర్ల తొలగింపులపై ఆరా తీశారు. కొత్తగా ఓటర్ల నమోదుకు ఈ నెల 9 వరకు గడువు ఉన్నట్లు ఆయన తెలిపారు. అర్హులైన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 18 నుంచి 19 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న వారికి కొత్తగా ఓటరు నమోదుకు చివరి అవకాశమని తెలిపారు. ఓటర్ల జాబితాలో ఎటువంటి పొరబాట్లు లేకుండా చూడాలని ఆయన బీఎల్‌వోలకు సుచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాము, డిప్యూటీ తహసీల్దార్‌లు రవినాయక్, గౌరీశంకర్ పాల్గొన్నారు.